సాక్షి
మంచిర్యాల

మంగళవారం । 20 । ఆగస్టు । 2024



శిశుమందిరాల పాత్ర..

విద్యార్థుల్లో సంస్కారం, క్రమశిక్షణ పెంపొందించడంలో సరస్వతీ శిశుమందిరాల పాత్ర అనిర్వచనీయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.

10లో▸



బడుల్లో 'ఆట'ంకం!

ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో క్రీడామైదానాలు, ఆటల పీరియడ్‌లు లేవు. మరోవైపు వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆటలు ఆడించేవారే కరువయ్యారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఆగ్నేయం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జికి ఘన స్వాగతం



జడ్జికి స్వాగతం పలుకుతున్న న్యాయవాదులు

లక్సెట్టిపేట: హైకోర్టు జడ్జి కే.శరత్‌కు లక్సెట్టిపేట మున్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు సోమవారం స్థానిక ఐబీ ఆవరణలో ఘనంగా స్వాగతం పలికారు. పోలీసులు వందన సమర్పణ చేసి బందోబస్తు నిర్వహించారు. కోర్టు నిర్మించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకల కోసం కృషి చేయాలని స్థానిక న్యాయవాదులు కోరారు. సమస్యలు పరిష్కరించాలని వివరించారు. అనంతరం ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, జూనియర్ సివిల్ జడ్జి సంపత్, అసదుల్ల షరీఫ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మేదరి సాగర్ హాజీపూర్ మండలం దొనబండ గ్రామ శివారులో తన భార్య పేరిట 50 సంవత్సరాల క్రితం భూమి కొనుగోలు చేశానని, అప్పటి నుంచి ఇప్పటి వరకు భూమి తమ ఆధీనంలోనే ఉందని, ఒక వ్యక్తి ధరణిలో అక్రమంగా తన పేరిట మార్చున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకో వాలని కోరారు. గుల్లకోట గ్రామానికి చెందిన కే.ప్రవీణ్ తనకు ఆర్ఆర్ ప్యాకేజీ కింద రావాల్సిన డబ్బులు ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



గ్రామస్తులకు సూచనలిస్తున్న డాక్టర్ అనిత

తాండూర్: గ్రామాలు, మారుమూల పల్లెల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కీటక జనిత వ్యాధి నిరోధక జిల్లా అధికారి(ప్రోగ్రాం ఆఫీసర్) డాక్టర్ ఎస్.అనిత సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్, నర్సాపూర్ గ్రామాల్లో తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించారు. తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.

'అక్రమంగా కేసుల నమోదు'



రాస్తారోకోలో దివాకర్‌రావు, నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నస్పూరు మున్సిపల్ కౌన్సిలర్ బేర సత్యనారాయణపై అక్రమంగా కేసు నమోదు చేయించారని, అక్రమ కేసులు నమోదు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బీఆర్ఎస్ నాయకులతో కలిసి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యనారాయణపై అక్రమ కేసు పెట్టిన నస్పూరు మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల ఏసీపీలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులపై దాడులు, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను బలవంతంగా అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

మిల్లుల్లో ఆగని దందా!



ఇటీవల మందమర్రి మండలం ఆదిల్‌పేట్‌లోని ఓ మిల్లులో టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పట్టుబడిన రేషన్‌బియ్యం

- రేషన్ బియ్యం కలుపుతూ అక్రమాలు
- సీఎంఆర్ రీ సైక్లింగ్ చేస్తున్నారనే ఆరోపణలు
- నోటీసులు, జరిమానాలకు బెదరని వైనం
- జిల్లాలో మారని కొందరు మిల్లర్ల తీరు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రైస్‌మిల్లు యాజమాన్యాల అక్రమ దందా ఆగడం లేదు. రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యాన్ని సకాలంలో ఇవ్వకుండా జాప్యం చేయడమే కాకుండా కొందరు మిల్లర్లు ఏకంగా రేషన్ బియ్యాన్నే రీ సైక్లింగ్ చేస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. ఇటీవల మందమర్రి మండలం ఆదిల్‌పేట శివారులోని నీలం బ్రదర్స్ రైస్‌మిల్లులో 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేయగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గతంలో హాజీపూర్ మండల పరిధిలోనూ ఓ మిల్లులో రేషన్ బియ్య పట్టుబడింది. సర్కారు ఇచ్చిన ధాన్యాన్ని సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్)గా మార్చి ఇవ్వాల్సి ఉన్నా.. రేషన్ బియ్యాన్నే రీ సైక్లింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎలాంటి శ్రమ లేకుండా తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేస్తూ అవే బియ్యాన్ని సంచుల్లో నింపేస్తూ గుట్టుగా వ్యవహారం సాగిస్తున్నారు.

హెచ్చరించినా మారని తీరు

మిల్లర్లు సర్కారు నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ నుంచి సమీక్షలు చేయడంతోపాటు మిల్లర్ల అసోసియేషన్‌ను హెచ్చరిస్తున్నారు. సీఎంఆర్ బకాయి పడిన డీఫాల్ట్ మిల్లర్లకు నోటీసులు ఇస్తున్నారు. ఇటీవల జైపూర్, చెన్నూర్ మండలాల్లో రెండు రైస్‌మిల్లులను పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేయడమే కాక, స్థానిక పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయినా చాలామంది మిల్లర్లలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. కొందరు మాత్రమే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సకాలంలో బియ్యం అందిస్తున్నారు. జిల్లాలో మొత్తం 35రా రైస్, 19బాయిల్డ్ కలిపి మొత్తం 54 మిల్లులు ఉన్నాయి. ప్రతీ సీజన్‌లో ఆయా మిల్లుల సామర్థ్యాన్ని బట్టి ధాన్యాన్ని కేటాయిస్తున్నారు. చాలామంది మిల్లర్లు సర్కారు విధించిన గడువులోపు మరాడించి బియ్యాన్ని పౌరసరఫరాలశాఖకు అప్పగించడం లేదు. విద్యుత్, కూలీలు, వర్షాలు, యంత్రాల మరమ్మతుల పేరుతో జాప్యం చేస్తున్నారు. దీంతో పౌరసరఫరాలశాఖకు పంపిణీ చేయాల్సిన బియ్యం స్టాక్‌లపై ప్రభావం చూపుతోంది.

సీఎంఆర్ వివరాలు

బకాయి పడిన ధాన్యం	35,425.86 క్వింటాళ్లు
బకాయి పడిన బియ్యం	23,614.77 క్వింటాళ్లు
వాటి విలువ	రూ.82.51కోట్లు
రికవరీ చేసింది	19,068 క్వింటాళ్లు
రికవరీ చేసిన విలువ	రూ.66.38కోట్లు
మిగిలింది	4546.37 క్వింటాళ్లు
మిగిలిన మొత్తం	రూ.16.10కోట్లు

డీఫాల్ట్ అయినా నోఫికర్..

జిల్లాలో ప్రతీ సీజన్‌లో కొందరు మిల్లర్లు ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ధాన్యాన్ని అమ్ముకుంటూ ఎప్పటికప్పుడు పౌరసరఫరాల శాఖను బురిడీ కొట్టిస్తున్నారు. నిల్వల్లో కచ్చితంగా లెక్కింపు లేకపోవడంతో ధాన్యంపై పర్యవేక్షణ కొరవడుతోంది. అధికారులు తనిఖీలు చేసినప్పటికీ ప్రతీ బస్తా లెక్కింపు సాధ్యం కాకపోవడంతో కలిసి వస్తోంది. ఇక మిల్లుల్లో కనీస సౌకర్యాలు లేకున్నా, టన్నుల కొద్దీ ధాన్యాన్ని నిల్వ చేసే సామర్థ్యం ఉండడం లేదు. ధాన్యం కొనుగోలు సమయంలో ఇబ్బంది లేకుండా ఉండేందుకు ధాన్యం దించుకునేందుకు అవకాశం ఇస్తున్నారు. జిల్లాలో గత నాలుగేళ్లుగా 55మిల్లులు డీఫాల్ట్‌గా మారాయి. ఇందులో కొన్ని మిల్లుల నుంచి జరిమానాలతో వసూలు చేయగా, ఇంకా కొన్ని మిల్లుల నుంచి చెల్లించాల్సి ఉంది. ఇప్పటికీ నోటీసులు ఇస్తున్నా స్పందన కరువవుతోంది. ప్రతీ సీజన్ నాటికి తమకు కచ్చితంగా రైతుల నుంచి ధాన్యం కేటాయిస్తారనే ధీమాతో ఉంటున్నారు.

కౌన్సిలర్‌పై కేసు నమోదు చేయాలి



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీసీపీ

నస్పూర్: మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్ బేర సత్యనారాయణపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు సోమవారం సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో తమ భూములు కబ్జా చేశాడని, అకారణంగా తమను కేసుల్లో నిందితులుగా చేర్చారని అంజయ్య, రొడ్డ రాజేశం, చింతల రామానుజం, శివరామయ్య, చిలువేరు శ్రీనివాస్, కిరణ్, తిప్పని భీమయ్య ఆరోపించారు. వీరికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుపై అసత్య ఆరోపణలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, పట్టణ అధ్యక్షుడు బండారు సుధాకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రోద్బలంతో నస్పూర్ మున్సిపల్ కమిషనర్ సతీష్ తనపై అకారణంగా అట్రాసిటీ కేసు నమోదు చేయించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కౌన్సిలర్ బేర సత్యనారాయణ ఏసీపీ కార్యాలయంలో కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే.

ప్రయాణికుల అసహనం

సీసీసీ కార్నర్ వద్ద ఆందోళనతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. రక్షాబంధన్ వేళ రాస్తారోకోతో ఇబ్బందులకు గురిచేయడంపై పలువురు ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఏదైనా సమస్య ఉంటే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయాలని, రోడ్లపై ప్రజలకు ఇబ్బందులు కల్గించరాదని పేర్కొన్నారు.

దంచికొట్టిన వర్షం



మంచిర్యాలలో కురుస్తున్న వర్షం

మంచిర్యాలఅగ్రికల్చర్/జైపూర్/మందమర్రిరూరల్: జిల్లాలో సోమవారం వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక్కటే ఎండ, ఉక్కపోత.. రెండు గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పలుచోట్ల ఒర్రెలు, వాగులు వరదనీటితో ప్రవహించాయి. వారం రోజులుగా వర్షాలు లేకపోగా ఎండలు మండుతూ వచ్చాయి. ఉక్కపోతతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో వాతావరణం చల్లబడింది. వరినారుమడుల్లోకి నీరు చేరడంతో కాస్త ఊరట చెందారు. ఆలస్యంగా వరి నాట్లు వేసుకుని నీటితడులు లేక ఎదురు చూస్తున్నారు. ఈ వర్షం వరిపంటకు మేలు చేసినట్లయింది. జైపూర్ మండలం రసూల్‌పల్లి వద్ద పెద్దవాగు, టేకుమట్ల వాగు ఉధృతంగా ప్రవహించాయి. జైపూర్‌లో రెండు పిడుగులు పడడంతో బిల్డింగ్‌పైన గోడలు పగిలాయి. మందమర్రిలో పట్టణంలో పలు ఏరియాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. 6వ వార్డు ఊరు రామకృష్ణాపూర్‌లోని ఎస్సీ కాలనీలో భీమ బుచ్చయ్య ఇంటి ముందు కాలువ లేకపోవడంతో వర్షపు నీరు ఇంటిలోకి చేరి సామగ్రి తడిసింది.

ఓసీపీలో నిలిచిన ఉత్పత్తి

శ్రీరాంపూర్: వర్షం వల్ల శ్రీరాంపూర్ ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. దీంతో క్వారీలో మైనింగ్ ఆపరేషన్స్ నిలిపివేశారు. ఓబీ వాహనాలను కూడా ఎక్కడికక్కడే నిలిపివేశారు. దీంతో సుమారు 3 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది.

బస్‌డిపో మంజూరుకు కృషి



ఎమ్మెల్యే వినోద్‌కు పూల మొక్క అందజేస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్
- క్యాంపు కార్యాలయంలో పూజలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా ఆర్టీసీ బస్‌డిపో మంజూరుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. సోమవారం ఏఎంసీ ఏరియా క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. డిపో మంజూరు కోసం రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడగా సానుకూలంగా స్పందించారని అన్నారు. త్వరలోనే బస్‌డిపో ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని మంత్రి సందర్శిస్తారని తెలిపారు. బెల్లంపల్లిలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లి మున్సిపాలిటీకి గోదారి జలాల సరఫరా కోసం రూ.430 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశామన్నారు.

క్యాంపు కార్యాలయంలో ప్రవేశం

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సోమవారం సతీమణి రమతో కలిసి క్యాంపు కార్యాలయం పునఃప్రారంభోత్సవం చేశారు. కుటుంబ సభ్యులు, శ్రేణులతో కలిసి సంప్రదాయబద్ధంగా సత్యనారాయణ వ్రతం ఆచరించారు. కాగా, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రూ.9 లక్షల అంచనాతో మరమ్మతు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జే.శ్వేత, మాజీ చైర్‌పర్సన్ మునిమంద స్వరూప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ సభ్యుడు సీహెచ్.శంకర్, నాయకులు మునిమంద రమేష్, మాధవరపు వెంకట నర్సింగరావు, బి.ప్రభాకర్, నాతరి స్వామి, ఆర్.సంతోష్, బి.హరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి సేవలందిస్తాం

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో గృహ ప్రవేశం సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణతో కలిసి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్యాష్ బ్యాగ్ దొంగలు దొరికారు

- మాజీ కారు డ్రైవరే సూత్రధారి
- నలుగురు నిందితుల అరెస్టు
- రూ.24లక్షల నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ శ్రీనివాసులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన కారులో నుంచి రూ.28లక్షల నగదు బ్యాగును దొంగిలించిన వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. 24గంటల వ్యవధిలోనే నలుగురు నిందితులను అరెస్టు చేసి నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం సీపీ శ్రీనివాసులు మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. శనివారం బెల్లంపల్లి బజార్‌ఏరియాలోని ఓ టిఫిన్ సెంటర్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన కారులో నుంచి రూ.28లక్షల నగదు బ్యాగును పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు దొంగిలించుకెళ్లిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని భరత్‌నగర్, అత్తాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న పటాలవత్ దాసు తనిష్క్ ప్లైవుడ్ కంపెనీ వ్యాపారి బిపిన్‌కుమార్ వద్ద గతంలో కారు డ్రైవర్‌గా పని చేశాడు. పెద్దమొత్తంలో కలెక్షన్ అవుతుందని, వాటిని దొంగిలించి జీవితంలో స్థిరపడాలని భావించాడు. డ్రైవర్‌గా పని మానేసే ముందు కారు నకిలీ తాళం చెవి చేయించుకున్నాడు. తన స్నేహితులు జోగు అలియాస్ పోతలు శివ(కిషన్‌బాగ్, అత్తాపూర్ హైదరాబాద్), ముప్పూరు రాజు(రంగారెడ్డి జిల్లా శివరాంపల్లి), పండుగ రాజు(కన్నాలబస్తీ బెల్లంపల్లి)లతో క్యాష్ బ్యాగ్ చోరీకి పథకం రూపొందించాడు. ఈ నెల 16న కంపెనీ మార్కెటింగ్, కలెక్షన్ బాయ్ కలెక్షన్‌కు బయల్దేరారని తెలుసుకుని కారులో హైదరాబాద్ నుంచి వెంబడించారు. అదేరోజు మంచిర్యాలలో వసూళ్లకు వచ్చిన కలెక్షన్‌బాయ్‌లు బస చేసిన లాడ్జికి చేరువలో ఉన్న గుడిలో నిద్రించారు. తెల్లవారుజామున నలుగురు వ్యక్తులు ఇద్దరిద్దరుగా విడిపోయి కలెక్షన్ బాయ్‌ల కారును బెల్లంపల్లి వరకు అనుసరించారు. కలెక్షన్‌బాయ్‌లు బెల్లంపల్లిలో టిఫిన్ చేసేందుకు కారును నిలిపి ఉంచగా శివ, దాసు ముఖానికి మాస్క్, హెల్మెట్ ధరించి పల్సర్ బైక్‌పై కారు వద్దకు వచ్చి తమ వద్ద ఉన్న నకిలీ కీతో డోర్ తెరిచి క్షణాల్లో డబ్బు బ్యాగుతో ఉడాయించారని సీపీ వివరించారు. ఆ రోజు రాత్రి పాతబెల్లంపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో తలదాచుకున్నారని తెలిపారు. సోమవారం బెల్లంపల్లిలో టిఫిన్ చేయడానికి బైక్‌పై క్యాష్‌బ్యాగ్‌తోవస్తుండగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మూలమలుపు వద్ద పట్టుకున్నామని తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి రూ.24లక్షల నగదు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ప్రకటించారు. నిందితులను పట్టుకున్న బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్ఓ ఎన్.దేవయ్య, కానిస్టేబుల్ మల్లేశం, మంచిర్యాల సీసీఎస్ కానిస్టేబుళ్లు సతీష్, శ్రీనివాస్‌లను సీపీ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించి క్యాష్ రివార్డు అందజేశారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్, పక్కన డీసీపీ, ఏసీపీలు

ఆర్టీసీ బస్సులు కిటకిట



బస్టాండ్‌లో వేచి చూస్తున్న ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో సోమవారం ఆర్టీసీ బస్సులు, బస్టాండ్లు కిటకిటలాడాయి. రాఖీ పండుగ కావడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో మంచిర్యాల బస్‌స్టేషన్ రద్దీగా మారింది. వచ్చిన బస్సులు వచ్చినట్లే నిండిపోయాయి. ప్రయాణికులకు కావాల్సిన సమాచారాన్ని అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, ప్రత్యేక సిబ్బంది అందించారు. సీట్లు లేకపోయినా ప్రయాణికులు నిల్చుని ప్రయాణం చేశారు. ఇంకోవైపు ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించారు. రోజువారి కంటే అదనపు బస్సులు నడిపించామని ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు.

ఘనంగా రాఖీ వేడుకలు



బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కు రాఖీ కడుతున్న నెన్నెల మాజీ సర్పంచ్ తోట సుజాత



మంచిర్యాలలో రాఖీ కడుతున్న సోదరి



బెల్లంపల్లిరూరల్: చంద్రవెల్లి గ్రామంలో తమ్ముళ్లకు రాఖీ కట్టి హారతి ఇస్తున్న అక్కలు

మంచిర్యాలఅర్బన్/నెన్నెల: జిల్లాలో సోమవారం రాఖీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే సోదరీమణులు సోదరుల ఇంటికి చేరుకున్నారు. సోదరుల నుదుట తిలకం దిద్ది రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. అప్యాయంగా సోదరులు బహుమానం అందజేశారు. రక్షాబంధన్ సందర్భంగా విదేశాల్లో ఉంటున్న తమ అన్నదమ్ములకు ఇక్కడ నివసిస్తున్న అక్కాచెల్లెళ్లు ముందస్తుగా రాఖీలు పంపించారు. సోమవారం అక్కడ రాఖీలు కట్టుకున్న దృశ్యాలను వీడియో కాల్ ద్వారా తిలకిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. అక్కాచెల్లెళ్లు పుట్టింటికి చేరడంతో సందడిగా మారింది. సెలవు రోజు కాకపోవడంతో మంచిర్యాల కేజీబీవీలో ఉన్న సోదరీమణుల వద్దకు కుటుంబ సభ్యులు వచ్చి రాఖీలు కట్టించుకున్నారు. స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నెన్నెల మాజీ సర్పంచ్ తోట సుజాత ఎమ్మెల్యే వినోద్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



సోదరుడికి స్వీట్లు తినిపిస్తున్న దృశ్యం



చెన్నూర్ కేజీబీవీలో రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు

క్లుప్తంగా

ఇద్దరిపై కేసు నమోదు

భీమారం: ఎలకేశ్వరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని పాత బస్తీకి చెందిన అమీర్, సమద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాములు సోమవారం తెలిపారు. ఈ నెల 14న ఇద్దరు వ్యక్తులు ఇంటికి వచ్చారనే విషయమై ఎలకేశ్వరం గ్రామానికి చెందిన వ్యక్తి ఫిర్యా దు చేయగా దీనిపై విచారణ జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈమేరకు ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. సదరు యువకులు ఉపయోగించిన కారును సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జైపూర్: మండలంలోని వెలిశాల మల్లన్న ఆల య సమీపంలో బైక్ అదుపుతప్పి ఒకరికి గా యాలయ్యాయి. భీమారం అటవీశాఖలో బీట్ అధికారిగా పనిచేస్తున్న శివకుమార్‌కు ఇందా రం చెక్ పోస్ట్‌లో ఆదివారం రాత్రి విధులు ని ర్వర్తించాడు. సోమవారం ఉదయం భీమారం వెళ్తున్న క్రమంలో వెలిశాల మల్లన్నస్వామి ఆల యం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మంచిర్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

యువకుల మృతికి కారకుడైన పాస్టర్‌పై కేసు

దండేపల్లి: మండలంలోని కొండాపూర్‌కు చెందిన గందం చరణ్(18), అల్తాటి అజయ్(19) ఆదివారం ద్వారక గోదావరిలో మునిగి చనిపోయారు. వారిద్దరి మృతికి కారకుడైన పాస్టర్ లింగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. మత మార్పిడిలో(బాప్తీజం) భాగంగా ఇద్దరు యువకులను ద్వారక గోదావరి నదిలో స్నానాలు చేయించేందుకు తీసుకెళ్లగా నీట మునిగి చనిపోయారు. వారికి ఈత రాకున్నా నదిలో దింపి స్నానాలు చేయించాడని చరణ్ తల్లి వసంత ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్‌లో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. వీరాపూర్ గ్రామానికి చెందిన సిద్దం అశోక్, సిద్దం పవన్ ఆదివారం రాత్రి బైక్‌పై బెల్లంపల్లి నుంచి వస్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. అశోక్, పవన్‌కు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బెల్లంపల్లి: పట్టణంలోని గంగారాంనగర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై మహేందర్ తెలిపారు. సుభాష్‌నగర్ బస్తీకి చెందిన సొల్లు సమ్మయ్య (42) ఆదివారం రాత్రి రోడ్డు దాటుతుండగా తాండూర్ వైపు నుంచి బైక్‌పై వస్తున్న తోటపల్లి అభినవ్ ఢీకొట్టాడు. ఘటనలో సమ్మయ్య తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని కుమారుడు సాయి మదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బడుల్లో ఆటంకం..!

- ఆటలకు కేటాయించని సమయం
- పాఠశాలల్లో కానరాని మైదానాలు
- వెక్కిరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలు


క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: క్రీడలు విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి. విద్యార్థులకు రోజువారీ శారీరక వ్యాయామం అవసరం. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై సులభంగా దృష్టి సారించే అవకాశం ఉంటుంది. ఆత్మ విశ్వాసం, మానసిక చురుకుదనానికి దోహదపడే క్రీడలకు ఆటంకం కలుగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చాలా పాఠశాలల్లో క్రీడా మైదానాలు, ఆటల పీరియడ్‌లు లేవు. పలు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు కూడా భర్తీ, క్రీడలకు ఆటస్థలాలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరం కావాల్సిన పరిస్థితి. పాఠశాలల్లో రోజూ గంట పాటు ఆటల పీరియడ్ కేటాయించాలని ఇటీవల శాసనమండలిలో ఎమ్మెల్సీల అభ్యర్థనతో డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించి క్రీడలకు ప్రాధాన్యతపై విద్యాశాఖకు ఆదేశాలిస్తామన్నారు. పలు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, క్రీడలకు స్థలాలు లేకపోవడంతో ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

క్రీడలకు దూరం

పాఠశాలల్లో వార్షికోత్సవమో.. పంద్రాగస్టు, రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు మినహా మిగిలిన సమయాల్లో తక్కువే. డ్రిల్ పీరియడ్ మరిచిపోయి చదువుపై దృష్టి పెట్టడంతో విద్యార్థులకు ఆటలంటే ఏమిటో తెలియకుండా పోతోంది. అడపాదడపా క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం తప్పా మరో ఆట తెలియకుండా పోతోంది. ప్రభుత్వ పాఠశాలలు ఉన్నా పీఈటీలు లేకపోవడం, మెజార్టీ ప్రైవేట్ పాఠశాలల్లో మైదానాలు లేకుండా పోయాయి. మంచిర్యాల జిల్లాలోని 1,083 పాఠశాలల్లో 1,12,685 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో ప్రభుత్వ, లోకల్ బాడీ 724 పాఠశాలల్లో 33,425 మంది, రెసిడెన్షియల్, ఇతర ప్రభుత్వ 136 పాఠశాలల్లో 20,182 మంది, 221 ప్రైవేటు పాఠశాలల్లో 58,033 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 646 పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఆటలకు సమయం కేటాయించకపోవడంతో క్రీడలపై విద్యార్థులకు ఆసక్తి లేకుండా పోయింది.

క్రీడాపోటీల నిర్వహణ ఎలా..

మంచిర్యాల జిల్లాలో 110 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం 34 పీఈటీ పోస్టులను పీడీ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసింది. ఇద్దరు పీఈటీలుగా పనిచేస్తున్నారు. ఇంకా రెండు పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ఉంటే ఇద్దరికి కూడా పీడీలుగా ప్రమోషన్ అవకాశం లభించేది. పార్ట్‌టైం పీఈటీలు 10 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. 47 మంది పీడీలు, ఇద్దరు పీఈటీలు పనిచేస్తుండగా రెండు పీడీ, నాలుగు పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 45 ఉన్నత పాఠశాలల్లో పోస్టులు మంజూరు చేయాల్సి ఉంది. ప్రైవేట్ పాఠశాలలు భవనాల్లో సాగిస్తుండగా క్రీడామైదానాలు కనిపించని పరిస్థితి. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు, ట్యూషన్లతో పాటు హోంవర్క్‌లకే పరిమితం కావడంతో ఆటలపై ఆసక్తి అంతంత మాత్రంగానే మారింది.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	మొత్తం పాఠశాలలు	ఆటస్థలం ఉన్నవి	పీఈటీ పోస్టులు	ఖాళీలు
మంచిర్యాల	1,083	646	57	06
ఆదిలాబాద్	785	120	34	04
నిర్మల్	735	590	53	07
కుమురంభీం	732	68	27	02

దాతల సహకారంతోనే..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు దాతల సహకారం కోసం ఎదురు చూడక తప్పడం లేదు. ఇప్పటికే జిల్లా, జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల క్యాలెండర్ విడుదలైంది. కానీ నిధులు కేటాయించకపోవడంతో పోటీలు ఎలా నిర్వహిస్తారనేది తెలియకుండా పోయింది. డీసీఈబీ ప్రతీ విద్యార్థి నుంచి వసూలు చేసే పరీక్ష ఫీజు నుంచి మూడు రూపాయలు ఎస్‌జీఎఫ్ ఖాతాలో జమ చేయడం మర్చిపోతున్నారు. 2018 నుంచి రావాల్సిన ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల బడ్జెట్ దాదాపుగా రూ.16 లక్షల వరకు రావాల్సి ఉంది. అప్పులు చేసి పోటీలు నిర్వహించిన పీఈటీలు ఆటల పోటీలంటే విముఖత చూపుతున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్తగా క్రీడాపాలసీ తీసుకొస్తామని ప్రకటించడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నింపుతోంది.

అనుమానమే పెనుభూతమై..

- భార్యను హతమార్చిన భర్త
- దండేపల్లి మండలం కాసిపేటలో ఘటన


విమల(ఫైల్)


ఘటన స్థలంలో విమల మృతదేహం

దండేపల్లి: అనుమానమే పెనుభూతమైంది. కట్టుకున్న భర్తే కాలయముడై భార్యను హత్య చేసిన ఘటన దండేపల్లి మండలం కాసిపేటలో చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాసిపేటకు చెందిన ఆవుల నరేష్, అదే గ్రామానికి చెందిన దుమల్ల విమల (28) 2012లో ప్రేమ వివాహం చేసుకున్నారు. దంపతులకు ముగ్గురు పిల్లలు సంతానం. నరేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో విమల వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుందని అనుమానిస్తూ తరచూ గొడవ పడేవాడు. ఈ విషయంలో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా నిర్వహించారు. అయిన అతనిలో మార్పు రాలేదు. ఆదివారం విమల ఇంటికి ఆమె తల్లి సునీత, సోదరి సరిత వెళ్లి రాఖీ పండగకు ఇంటికి రావాలని పిలిచారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న నరేష్ కొద్దిసేపటి తర్వాత వస్తుందని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. రాత్రయినా రాకపోవడంతో మరోసారి ఆమె ఇంటికి వెళ్లి పిలువగా మాట్లాడలేదు. దీంతో అనుమానం వచ్చి తలుపులు నెట్టగా నరేష్ చేతిలో ఇనుపరాడ్ పట్టుకుని కనిపించాడు. అత్త, వదినను చూసి ఇంట్లో నుంచి పారిపోయాడు. దీంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా విమల తలపై గాయంతో బెడ్‌పై శవమై కనిపించింది. మృతురాలి తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి, పలువురికి గాయాలు


చంద్రశేఖర్ మృతదేహం

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ గుడి సమీపంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం అడ గ్రామానికి చెందిన మేకల చంద్రశేఖర్ (41) తన కారులో స్నేహితులతో కలిసి హైదరాబాద్ నుండి వస్తుండగా బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ గుడి సమీపంలో రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టారు. ఘటనలో మేకల చంద్రశేఖర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న మిగతా ఐదుగురికి గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్వర్టును ఢీకొట్టిన పాలవ్యాన్

- ఇద్దరు మృతి, ఒకరికి తీవ్రగాయాలు
- పండుగ పూట విషాదం...


భద్ర (ఫైల్)


మల్లేశ్ (ఫైల్)


పాల వ్యాన్‌లో మృతదేహాలు

కాసిపేట: ఒకవైపు రాఖీ పౌర్ణమి సందర్భంగా అంతా సిద్ధమవుతున్న క్రమంలో సోమవారం తెల్ల వారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం అందుగులపేటకు చెందిన డ్రైవర్ నవనందుల మల్లేశ్ (22), మందమర్రికి చెందిన బైరినేని భద్ర (18), బైరినేని శంకర్ సోమవారం తెల్లవారు జామున సుమారు 2:30 గంటలకు వ్యాన్‌లో పాల ప్యాకెట్లు వేసుకుని బెల్లంపల్లిలో పంపిణీ చేసేందుకు వెళ్తుండగా డ్రైవర్ నిద్ర మత్తులో అతివేగంగా కల్వర్టును ఢీ కొట్టాడు. భద్ర, మల్లేశ్‌కు తీవ్రగాయాలు కావడంతో క్యాబిన్‌లోనే మృతి చెందారు. శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగానే ఉంది. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అఫ్జలుద్దీన్, ఎస్సై

బెల్లంపల్లి: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. సోమవారం టూటౌన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 17న రైల్వేస్టేషన్ ఎదుట గంజాయి విక్రయిస్తున్న రామకృష్ణాపూర్‌లోని రామాలయం ఏరియాకు చెందిన పొన్నాల వెంకటేష్, మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన చాయ దిలీప్ యాదవ్ అనే మహిళను అరెస్టు చేసినట్లు వివరించారు. ఈమేరకు నిందితులిద్దరిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై కె. మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగును ఆకర్షించిన ఫోన్

- వర్షంలో ఫోన్ మాట్లాడుతుండగా ఘటన
- అక్కడికక్కడే మృతి చెందిన రైతు
- పండుగపూట బిట్టూర్‌పల్లిలో విషాదం


భాస్కర్‌గౌడ్ మృతదేహం


భాస్కర్‌గౌడ్ (ఫైల్)

భీమిని: అంతా సంతోషంగా రాఖీ పండుగ జరుపుకుంటున్న వేళ పిడుగుపాటు ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని బిట్టూర్‌పల్లికి చెందిన జక్కుల భాస్కర్‌గౌడ్ (56) గ్రామ పరిధిలోని చెరువు కింద వరి సాగు చేస్తున్నాడు. పొలానికి సాగునీరు అందించేందుకు నలుగురితో కలిసి సోమవారం కాలువ మరమ్మతు పనులు చేస్తున్నారు. ఇంతలోనే భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో భాస్కర్‌గౌడ్ స్థానికంగా ఉన్న ఈత చెట్టు కిందికి వెళ్లాడు. తన ఆండ్రాయిడ్ మొబైల్‌తో ఫోన్‌లో మాట్లాడుతుండగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య సువర్ణ, కుమారులు ప్రసాద్, గణేశ్, కూతురు సంగీత ఉన్నారు.

కుటుంబంలో విషాదం

రాఖీ పండుగ పూట భాస్కర్‌గౌడ్ భార్య సువర్ణ తన అన్నకు రాఖీ కట్టి వస్తానని చెప్పి కాసిపేటకు వెళ్లింది. మృతుని సోదరి కుమురంభీం జిల్లా వాంకిడి మండలం కమానా గ్రామం నుంచి భాస్కర్‌గౌడ్‌కు రాఖీ కట్టేందుకు బయలు దేరింది. కూతురు సంగీత మందమర్రి నుంచి తన సోదరులకు రాఖీ కట్టేందుకు వస్తుండగా మరణవార్త తెలియడంతో అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. రాఖీ పౌర్ణమి ఎంతో సంతోషంగా జరగాల్సిన ఇంట్లో చావుడప్పు మోగడం అందర్నీ కలిచివేసింది. మృతుని కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమిని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బీపీఎం మృతి


శ్రీనివాస్ (ఫైల్)

జన్నారం: అప్పులబాధ భరించలేక పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన పొనకల్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం బాదంపల్లి గ్రామానికి చెందిన వంగపల్లి శ్రీనివాస్ (40) పొనకల్ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం అదే గ్రామానికి చెందిన ఆనందం వద్ద రూ.11 లక్షలు అప్పుగా తీసుకుని తిరిగి రూ.4 లక్షలు చెల్లించాడు. అయితే వాటిని వడ్డీకింద జమ చేసుకున్న ఆనందం ఇంకా రూ.11 లక్షలు ఇవ్వాలని ఈ నెల 8న శ్రీనివాస్ ఇంటికి వెళ్లి అప్పు తీర్చాలని వేధించాడు. దీంతో మనస్తాపానికి గురై గ్రామ సమీపంలో పురుగుల మందు తాగి పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుని భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కార్మిక హక్కులపై ఏఐటీయూసీకే అవగాహన

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణి కార్మికుల హక్కులపై ఏఐటీయూసీకే పూర్తి అవగాహన ఉందని ఆ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం మందమర్రిలోని యూనియన్ కార్యాలయంలో బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్లంపల్లి రీజియన్ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ ఎన్నికలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘంగా పదేళ్ల వ్యవహరించిన టీబీజీకేఎస్ ఏనాడూ కార్మిక సమస్యలపై సమావేశాలు నిర్వహించలేదన్నారు. ఏ ఏరియాలో కూడా సబ్ కమిటీలు ఏర్పాటు చేయలేదన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం ఏఐటీయూసీతోనే సాధ్యమన్నారు.

రీజియన్ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ ఎన్నిక

మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ రీజియన్ ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్, కార్యదర్శిగా రాజేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా తిరుపతిగౌడ్, కోశాధికారిగా శ్రీహరి, ప్రచార కార్యదర్శులుగా నాగేశ్వర్, ఆశిష్‌కుమార్, సుభాష్ చంద్రబోస్, శ్రీనివాస్, రాజేశ్‌యాదవ్, వెంకటేశ్, క్రాంతికిరణ్, జావేద్, బురక ప్రశాంత్, రాజలింగును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఏటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ, మైనింగ్ స్టాఫ్ సెంట్రల్ ఇన్‌చార్జి మిరియాల రంగయ్య, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ వీరభద్రయ్య, నాయకులు ముస్కె సమ్మయ్య, అక్బర్ అలీ, షేక్ బాజీసైదా, దాగం మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన బొగ్గు బ్లాకులను ప్రారంభించాలి


మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య

కాసిపేట: సింగరేణిలో నూతన బొగ్గు బ్లాకులను ప్రారంభించాలని ఏఐటీయూసీ (ఎస్‌సీడబ్ల్యూ) అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట-1 ఇంక్‌లైన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓసీలు, బొగ్గు బావులు 10 నుంచి 15 సంవత్సరాల్లో మూతపడే అవకాశం ఉందని, కొత్తగా చేరిన యువతకు ఎక్కడ పని చేయాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఓ వైపు కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను ప్రైవేట్‌పరం చేస్తుంటే మరోవైపు నూతన బొగ్గు గనులు రాకపోవడంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. ఏఐటీయూసీని గుర్తింపు సంఘంగా కార్మికులు ఎన్నుకున్నప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వకపోవ డం దురదృష్టకరమన్నారు. అయినప్పటికీ యాజ మాన్యం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారించేదుకు కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగానే గ్రీన్, ఎల్లో, రెడ్ కార్డు విధానాలను రద్దు చేయించినట్లు తెలిపారు. సమావేశంలో బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి సహాయ కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్, పిట్ కార్యదర్శి మినుగుల లక్ష్మీనారాయణ, నాయకులు నాగేశ్వర్ రావు, రంజిత్‌కుమార్, శ్రీహరి, రాజేందర్, సురేష్, సంతోష్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎన్‌హెచ్ బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల-ఆర్మూర్ నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి తమగోడు వెలిబుచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కారణంగా మా బతుకులు రోడ్డున పడ్డ చందంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రఘునాథ్ దళారులతో కలిసి అలైన్‌మెంట్ మార్చి లక్సెట్టిపేట బైపాస్ ద్వారా రోడ్డు ఏర్పాటుకు పైరవీ చేయడం వల్ల దాదాపు మూడు మండలాల్లోని 500 మంది రైతులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కేవలం తన స్వప్రయోజనాల కోసం పాత రహదారి నుంచి కాకుండా ఓ మైనార్టీ కళాశాల కోసం రోడ్ అలైన్‌మెంట్ మార్చి ఢిల్లీ పెద్దలను అడ్డంగా పెట్టుకుని పైరవీలతో ఆర్థిక లబ్ధి పొందాడని ఆరోపించారు. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌తో ముంపునకు గురయ్యామని, ఇప్పుడు ఎన్‌హెచ్ విస్తరణతో మరోసారి నిరాశ్రయులను చేసేందుకు కుట్ర సాగిందన్నారు. దీనిని అడ్డుకుని రైతులకు అండగా నిలవాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి సంజయ్ మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులతో చర్చించి నష్టం జరగకుండా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బాధితులు లగిశెట్టి రాజమౌళి, జనార్దన్‌రెడ్డి, శ్యామ్, రమారెడ్డి, గోళ్ల తిరుపతి, వెంకటేశ్, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


వంశీకృష్ణ (ఫైల్)

దండేపల్లి: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల మేరకు మేదరిపేటకు చెందిన కారు డ్రైవర్ పొన్నం వంశీకృష్ణ (22) కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఆదివారం తన ఇంటి సమీపంలోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తల, మెడకు గాయాలు, నోటి నుంచి నురగ కూడా రావడంతో మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తాను కొత్తగా నిర్మిస్తున్న ఇంటిస్థలంపై వివాదం నెలకొనడంతో పాటు కోర్టులో కేసు కూడా నడుస్తుంది. తన కుమారుని మృతిపై అనుమానం ఉందని మృతుని తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్సై ఉదయ్‌కిరణ్

అవయవదానం కేసులో వీడని చిక్కుముడి

- అంబులెన్సు నిర్వాహకుల అసత్య ప్రచారం
- అవయవాలు అమ్ముకోలేదంటున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: ఈ నెల 6న జైపూర్ మండలం షెట్‌పల్లికి చెందిన రెవెళ్లి శ్రీకాంత్ (35) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా అతని అవయవాలను అంబులెన్స్ నిర్వాహకులు అమ్ముకున్నారనే ఆరోపణల మేరకు బాధితులు మంచిర్యాల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం సోమవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్ వివరాలు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి విచారణ చేశామన్నారు. శ్రీకాంత్‌ను కరీంనగర్‌లోని భద్రకాళి ఆస్పత్రికి తరలిస్తుండగా స్థానిక ఆర్‌బీహెచ్‌వి స్కూల్ ఎదుట అతని స్నేహితులమంటూ అంబులెన్స్‌లో ఎక్కిన కారెందుల కిరణ్, నార్ల నరేష్, చాల్‌బాలి శ్రావణ్ (నాని), తాకిరే సాయిరాం కెల్విన్ ఆస్పత్రిలో మంచి చికిత్స చేస్తారని చెప్పి తీసుకెళ్లారు. అక్కడ స్కానింగ్ లేక పోవడంతో అందులో పనిచేసే సురేష్, ప్రశాంత్ కృష్ణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపించారు. స్కానింగ్ అనంతరం రిపోర్ట్‌ను పరిశీలించిన డాక్టర్ సురేష్ పరిస్థితి సీరియస్‌గానే ఉందని డాక్టర్ ప్రశాంత్, సురేష్ చికిత్స అందించారు. అనంతరం పేషెంట్ కండీషన్ సీరియస్‌గానే ఉందని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి మంచిర్యాలకు చెందిన అంబులెన్స్ డ్రైవర్లు శ్రావణ్, కిరణ్, సాయి, నరేష్, సాగర్ మరో అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలిస్తుండగా గజ్వేల్ వరకు వెళ్లేసరికి కామినేని ఆస్పత్రి నుంచి యాదగిరి అనే వ్యక్తి ఫోన్ చేసి యశోదకు వద్దని, కామినేనికి వెళ్లమని చెప్పడంతో అక్కడికి వెళ్లారు.

రెండు రోజుల పాటు వైద్యం...

రెండు రోజులపాటు చికిత్స అనంతరం శ్రీకాంత్ బ్రెయిన్ డెడ్ అయ్యిందంటూ ధ్రువీకరించారు. కామినేని ఆస్పత్రిలో జీవన్ దాన్ స్కీం అందుబాటులో ఉండగా కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు శ్రీకాంత్ అవయవాలను దానం చేశారు.

అవయవాలు అమ్ముకోలేదు

శ్రీకాంత్ కుటుంబ సభ్యులు, అంబులెన్స్ నిర్వాహకులు అవయవాలు అమ్ముకోలేదని, దానం మాత్రమే చేశారని డీసీపీ పేర్కొన్నారు. శ్రీకాంత్ అవయవ దానం ద్వారా ఏడుగురి ప్రాణాలు దక్కాయని వెల్లడించారు. శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు కామినేని ఆస్పత్రి సిబ్బంది రూ.3లక్షలు ఇచ్చారనేది వాస్తవం కాదన్నారు. దీనిపై పూర్తి విచారణ చేయాల్సి ఉందన్నారు. సంబంధం లేకుండా జోక్యం చేసుకుని కమీషన్ల కోసం శ్రీకాంత్‌కు సరైన సమయంలో వైద్యం అందకుండా చేసిన ఐదుగురు అంబులెన్స్ నిర్వాహకులు, కమీషన్లు రాలేదన్న అక్కసుతో శ్రీకాంత్ బావమరిది రాజుకు ఫోన్ చేసి అవయవాలు అమ్ముకున్నారని అసత్య ప్రచారం చేసిన అంబులెన్స్ నిర్వాహకులు కిరణ్, నరేష్, శ్రావణ్, సాయిరాం, సాగర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

విచారణ పూర్తి కాలేదు...

ఈ కేసులో సాంకేతిక ఆధారాలు, హైదరాబాద్‌లో వీరికి సహకరించే వ్యక్తుల గురించి విచారణ చేయాల్సి ఉందని, తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ కస్టడీకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తామన్నారు. సమావేశంలో ఏసీపీ ప్రకాష్, సీఐ బన్సీలాల్, ఎస్సై సనత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా..

కాగజ్‌నగర్ రూరల్: బురదగూడ వంతెన వద్ద సోమవారం ఆటో బోల్తా పడి ఎనిమిది మందికి గాయాలయ్యాయి. బారెగూడ నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న ఆటో వంతెన సమీపంలో బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న మండోరె శకుంతల, గొర్రె శ్రీదేవి, విష్ణు, విద్యశ్రీ, సంధ్యారాణితో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. డ్రైవర్ సోలంకి రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.